క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాల ఆదివారం ఘనంగా నిర్వహించారు. దుగ్గొండి, వెంకటాపురం, రేబల్లె, లక్ష్మీపురం, బిక్కాజిపల్లి, పొనకల్, నాచినపల్లి, తదితర గ్రామాల్లో డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి వెళ్లి బోనం సమర్పించారు. మండలంలో పండుగ సందడి నెలకొంది. పోచమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

'రైతు బీమా'కు దరఖాస్తు చేసుకోవాలి

నెక్కొండ/పర్వతగిరి : మండలానికి చెందిన అర్హులైన రైతులు రైతు బీమా పథకానికి ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నెక్కొండ, పర్వతగిరి మండల వ్యవసాయ అధికారులు ఎగిడి నాగరాజు, ప్రశాంత్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. సదరు పథకంతో అన్నదాతల కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏడేళ్ల క్రితం పథకాన్ని ప్రారంభభించగా ఇప్పటివరకు అనేక రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. జూన్ 5 నాటికి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు అవకాశం ఉందని తెలిపారు. రైతు బీమా పాలసీ ఏటా ఆగస్టు 14 నుంచి మరుసటి ఏడాది ఆగస్టు 13 వరకు అమలులో ఉంటుందని వివరించారు. పథకం కింద పేరు నమోదు చేసుకోవడానికి 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు వయస్సున్న రైతులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్‌తోపాటు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలను సంబంధిత ఏఈఓలకు అందజేయాలని తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



పర్వతగిరి : మండలంలోని పర్వతగిరికి చెందిన పిండి తిరుమలేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి స్థానిక హైస్కూల్‌లో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆదివారం రూ.35 వేల నగదు సాయం అందజేశారు. తొలుత తిరుమలేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తిరుమలేశ్ స్నేహితులు మాడుగుల రాజు, బండి సంతోశ్, ముంజ శ్రావణ్, కుంట మధుకర్, అశోక్, అమ్జద్, రవీందర్, కృష్ణం రాజు, రాజేంద్రచారి, గడ్డి యాకయ్య, భాస్కర్, బీక్యా, శ్రీను, దొనికి రవి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఔదార్యం



వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు 2012–13 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం రూ.20 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సాయం అందించాలనే ఉద్దేశ్యంతో నగదు సమీకరించి ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థులకు ఉపకరించేలా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బొల్లం శేఖర్, సందీప్‌కుమార్, బూడిద మహేశ్ గౌడ్, బత్తిని ప్రశాంత్, అల్లం కౌశిక్, రమేశ్, సురేశ్, ఆకుల రనీత, రావుల ఉమారాణి, చొప్పర మౌనిక, మారెపెల్లి నవ్య, సునిత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ వహించాలి

ఆత్మకూరు : సమాజంలోని ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని ఆత్మకూరు దేశాయ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏరుకొండ రవీందర్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం రవీందర్ గౌడ్ మాట్లాడుతూ వాసన్‌కేర్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్ గుర్రం ప్రభాకర్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ టింగిలికారి సత్యనారాయణ, సెక్రటరీ నాగబండి శివప్రసాద్, ట్రెజరర్ బాదం వెంకటేశ్వర్లు, తాళ్ల చంద్రయ్య, గుర్రం ఆనందం, బుచ్చిరెడ్డి, వాసన్ అనిశెట్టి చేతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంకర రోడ్లతో కష్టాలు

● అన్నదాతలకు, ప్రజలకు తప్పని తిప్పలు

దుగ్గొండి : మండల ప్రజలకు, అన్నదాతలకు కంకర రోడ్లతో కష్టాలు తప్పడం లేదు. గ్రామీణా ప్రాంతాలను అనుసంధానం చేస్తూ మండలవ్యాప్తంగా పలు లింక్ రోడ్లకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేయగా కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకుని కొంత వరకు పనులు చేపట్టారు. అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో కంకర తేలిన రోడ్లపై అన్నదాతలు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నడక సైతం నరకప్రాయంగా మారిన దుస్థితి నెలకొంది. మండలంలోని వెంకటాపురం నుంచి మహ్మదాపురం మీదుగా నర్సంపేట మండల పరిధిలోని రాజేశ్వర్‌రావుపల్లి వరకు 6 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం, గోపాలపురం నుంచి గొల్లపల్లి వరకు 1.2 కిలోమీటర్ల తారు రోడ్డు, రేకంపల్లి నుంచి తిమ్మంపేట వరకు 2 కిలోమీటర్ల మేరకు, చలపర్తి మార్కెటింగ్ శాఖ గోదాము నుంచి లక్నెపల్లి, తిమ్మంపేట ప్రధాన రహదారి వరకు 400 మీటర్ల తారురోడ్డు నిర్మాణం కోసం 2023 జనవరిలో ఎంఆర్ఆర్ గ్రాంటు కింద నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఫార్మేషన్ పూర్తి చేసి కంకర వేసి తొక్కించారు. అప్పుడే సాధారణ ఎన్నికలు రాగా పనులు ఆపేశారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అప్పటి నుంచి రెండున్నరేళ్లుగా కంకర తేలిన రోడ్లపైనే రైతులు, ప్రజలు ప్రయాణం సాగించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కంకరపై నడవాల్సి వస్తుండడంతో దుక్కిటెద్దులు కాళ్లు పగిలిపోయి అనారోగ్యం పాలవుతున్నాయి. పలుమార్లు కాళ్లకు రక్త గాయాలైన కొన్ని దుక్కిటెద్దులు కంకర రోడ్లపైకి తీసుకొస్తే బెంబేలెత్తి పారిపోతున్న దుస్థితి చోటు చేసుకుంది. రోడ్ల పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. ఇకనైనా ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కంకరతేలిన వెంకటాపురం-మహ్మదాపురం మీదుగా రాజేశ్వర్‌రావుపల్లి వెళ్లే రోడ్డు



మండలంలోని గోపాలపురం-గొల్లపల్లి రోడ్డు



రేకంపల్లి- తిమ్మంపేట రోడ్డు

బిల్లులు రాకపోవడంతో..

ఎంఆర్ఆర్ గ్రాంటు కింద నిధులు మంజూరు రాకపోవడంతో కాంట్రాక్టర్లు మండలంలోని సీసీ రోడ్ల పనులు చేపట్టడం లేదు. కాంట్రాక్టర్లు ఫార్మేషన్, కంకర పనులు పూర్తి చేయగా బీటీ పనులు మాత్రమే మిగిలాయి. బిల్లులు రాకపోవడంతో పనులు ఎలా చేయాలని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తదుపరి ఆదేశాల మేరకు పనులు కొనసాగిస్తాం.

- రంజిత్, స్పెషల్ ఏఈ, పీఆర్ శాఖ

'స్థానిక' ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

● బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భూక్య నవీన్ ఆధ్వర్యంలో బీజేపీలో ఆదివారం చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మోసపూరిత హామీలపై ప్రజలు విసుగు చెందారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీ దిశగా చూస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో పార్టీలో చేరికలు పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారికి సముచిత గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. తద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, ప్రధాన కార్యదర్శి మురహరి విజయ్, నాయకులు భూక్య హరీశ్, భూక్య వినోద్, భూక్య రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట : పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు ఠాకూర్ రవీందర్ సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ ఆదివారం పరామర్శించి రూ.5 వేల సాయం అందజేయగా ఆ పార్టీ నాయకుడు డాక్టర్ కంభంపాటి పుల్లారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల సాయం అందజేశారు. అలాగే పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు తోటి భిక్షపతి, ప్రముఖ వ్యాపారి బూర అశోక్ ఇటీవల వేర్వేరు ఘటనల్లో మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించారు.

బియ్యం పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన మేడి సాయిలు, కంచ రంజిత్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి ఆదివారం 50 కేజీల చొప్పున బియ్యం సాయంగా అందజేశారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ మేడి వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ అమీర్, నాయకులు ఉప్పరి కొమురయ్య, తాళ్ల సమ్మయ్య, మండల రవి, మేడి సంతోశ్, మొర్రి వీరస్వామి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కన్నం సందీప్, మేడి సాయి, వినోద్, కోరె అశోక్, కంచ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సేవలు అభినందనీయం

● మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు



సుబ్బారావును సత్కరిస్తున్న హరిబాబు, తదితరులు

ఖానాపురం : పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాపరమైన సేవలు అందించడం అభినందనీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, కాకతీయ కమ్మ సంఘం మండల అధ్యక్షుడు దేవినేని వేణు కృష్ణ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు ఇటీవల డాక్టరేట్ పొందిన సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు, వేణు కృష్ణ మాట్లాడారు. సుబ్బారావు విద్యాసంస్థలు స్థాపించి అనాథ విద్యార్థులకు పదో తరగతి వరకు ఉచితంగా విద్యాభ్యాసం అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సైతం సొంత డబ్బుతో అందిస్తూ వారి ఉన్నతికి బాటలు వేస్తున్నారని చెప్పారు. అనంతరం సుబ్బారావు మాట్లాడారు. పేద విద్యార్థులకు సేవలు అందించడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లో మరింత మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. మండలంలో విద్యాపరంగా మరిన్ని సేవలు అందించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు వేములపల్లి వెంకట ప్రసాదరావు, వేణుగోపాల్ రావు, నరేంద్ర, ముఖేశ్ చౌదరి, పిచ్చేశ్వర్‌రావు, కిరణ్, సాంబశివరావు, శ్రీనివాస్, మోహన్‌రావు, శ్రీను, సురేశ్, నవీన్, గాంధీ, ఉమామహేశ్వర్, రాజా, అంకినీయుడు, సుధాకర్, కృష్ణ, సాంబశివ రావు, తదితరులు పాల్గొన్నారు.

'పైపులైన్'తో వరదనీటి సమస్యకు చెక్



జేసీబీతో చేపట్టిన పైపులైన్ పనులు

రాయపర్తి : మండలంలోని ఏకేతండాలో పైపులైన్ వేయించడం ద్వారా వరదనీటితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చెక్ పెట్టింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడారు. ఏకేతండాలో కొన్నేళ్లుగా వరదనీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో సమస్యను ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తండావాసులు తీసుకెళ్లగా ఆయన స్పందించారని చెప్పారు. సూర్యతండా ఎంపీటీసీ పరిధి ఇన్‌చార్జ్ సురేందర్‌రెడ్డి సూచన మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాల్వ తీయించి పైపులైన్ వేయించారు. ఈ క్రమంలో సమస్యకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చూపారంటూ తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మూనావత్ వెంకన్న, ఫౌండేషన్ ప్రతినిధి సంకినేని ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీమా డబ్బు అందజేత



మామునూరు : ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీరామ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు మేకల సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య వరలక్ష్మికి పొదుపు సంఘం అధ్యక్షుడు రాజు, ప్రతాపరుద్ర పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు బిల్లా అమరేందర్‌రెడ్డి ఆదివారం అభయ నిధి, సామూహిక బీమా కింద రూ.45 వేలను అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ముప్ప విజయ భాస్కర్, మేకల సతీష్, బైరి రమేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా దుశ్చర్యలను ఖండించాలి

ఖిలా వరంగల్ : అమెరికా దుశ్చర్యలను సమాజంలోని అన్ని వర్గాలూ ఖండించాలని కార్మిక రైతు సంఘాల నాయకులు గన్నారపు రమేష్, ఈసంపెల్లి బాబు, రాచర్ల బాలరాజు, అరూరి కుమార్, ముక్కెర రామస్వామి కోరారు. ఈనెల 13న వరంగల్ చౌరస్తాలో కిసాన్ మోర్చా జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో రైతు సంఘ నాయకుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవద్దని అమెరికా బెదిరిస్తోందని తెలిపారు. భారత సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టవద్దని మోదీ ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మొగిలి ప్రతాప్‌రెడ్డి, వీరగోని శంకరయ్య, అక్కెనపల్లి యాదగిరి, బైరబోయిన ఐలయ్య, ఇంద్రసేన, వల్లందాస్ కుమార్, గంట శంకర్, రఘుసాల సుమన్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఐనవోలు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించి గవర్నర్‌కు పంపిన క్రమంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదన్నారు. ద్వంద్వవైఖరి అవలంబిస్తూ బీసీలను మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు అన్యాయం చేసిందని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొంకాల నారాయణరెడ్డి, గబ్బెట రామ్ కుమార్, వరికాల్ గోపాల్, చిన్న మహేందర్, కుమారస్వామి, లెంకల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి అధునాతన వైద్యం

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : గ్రామీణ ప్రాంతాల్లోనూ అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని నెక్కొండ రోడ్డులో డాక్టర్ ఉప్పునూతల సంపత్, వజ్జ సాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో చికిత్స అందించేలా ఆస్పత్రి ఏర్పాటు చేయడం శుభపరిణామం తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సేవాభావంతో అత్యున్నత వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జయుడు, భారతి, మనోజ్‌లాల్, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, రాజారాం, మోహన్‌రావు, రాజేశ్వర రావు, ఉదయ్‌సింగ్, భరత్‌రెడ్డి, గోపాల్, వనజారెడ్డి, ఉజ్వల, భారతి తదితరులు పాల్గొన్నారు

'తీజ్'ను ప్రభుత్వం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

● మాజీ ఎంపీ సీతారాంనాయక్

నర్సంపేట : తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ కోరారు. మండలంలోని పలు తండాల్లో ఆదివారం నిర్వహించిన తీజ్ పండుగ ఉత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. తీజ్ పండుగను పచ్చదనం, నిండుదనం, అష్టైశ్వరాలకు మూలంగా అభివర్ణించారు. శుభ సూచకమని తెలిపారు. తీజ్ పండుగ దక్షిణ భారతదేశంలో కేవలం ఒక ప్రత్యేక గిరిజన తెగకు చెందిన లంబాడీలు ఆచరిస్తున్నట్టు చెప్పారు. బంజారాలు శ్రావణ మాసంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు బుట్టల్లో గోధమలు పెంచి నిమజ్జనం చేస్తారని తెలిపారు. తీజ్ పండుగ సాంస్కృతిక ప్రాధాన్యం ఉందన్నారు. బంజారాల ప్రకృతి పూజకు, సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా వివరించారు. గోధుమలు ఎంత పచ్చగా పెరిగితే సమాజం అంత సుభిక్షంగా ఉంటుందని విశ్వాసమని చెప్పారు. వ్రతం ఆచరించిన యువతులు సద్గుణ సంపన్నుడైన భర్త లభించాలని కోరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు, నాయకులు డాక్టర్ ఉదయ్‌సింగ్, ఆంగోతు భద్రయ్య, శ్యామ్ సింగ్, అమ్రూ, వీరసింగ్, సుభాశ్, స్వామి, పూల్‌సింగ్, భద్రు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉస్మాన్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సోమయ్య

రాయపర్తి : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పెన్షనర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ ఖాన్ తెలిపారు. మండల కేంద్రంలో సంఘం నూతన మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉస్మాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా రావుల భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులుగా బిల్ల విజయలక్ష్మి, ఆకుల నరేందర్‌రావు, పెద్దగోని ప్రేమలీల, జాయింట్ సెక్రటరీలుగా పబ్బోజు సోమలక్ష్మి, ఎనగందుల భాగ్యమ్మ, పబ్లిసిటీ సెక్రటరీగా అబ్బోజు రామ్మోహనాచారి, కోశాధికారిగా మహ్మద్ రహీమ్ ఖాన్, గౌరవ సలహాదార్లుగా ఉప్పు రామ్మూర్తి, కాంచనపల్లి వనజారాణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు ఉస్మాన్ ఖాన్ మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కమిటీ పని చేస్తుందని తెలిపారు. తద్వారా పెన్షనర్లకు సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తొలుత ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీపాద సోమయ్య మాట్లాడారు. కమిటీని ప్రకటించారు. కార్యవర్గం ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు.

కల్లెడలో పెద్ద మోరీ నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అనిల్‌రావు, నాయకులు

● కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు

పర్వతగిరి : మండలంలోని కల్లెడలో శిథిలావస్థలో ఉన్న పెద్ద మోరీని పునర్నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సమస్యను ఎమ్మెల్యేకు అనిల్‌రావు వివరించారు. మోరీ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కొత్తగా మోరీ నిర్మించి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదురుకోళ్ల రమేశ్, వడ్లకొండ రమేశ్, నీలం శ్రీనివాస్, డేగల రాకేశ్, గిద్దె సారయ్య, దాసరి సారయ్య, నక్క రాములు, తక్కళ్లపల్లి రవి, గడ్డం విష్ణు, గడ్డం బ్రహ్మ, కొండేటి వెంకన్న, గడ్డం ఇంద్రసేన, మాదారపు నాగరాజు, దాసరి ఈరమ్మ, తక్కళ్లపల్లి సాలమ్మ, తక్కళ్లపల్లి సంధ్య, జగదీశ్వరి, యశోద, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శివకుమార్



శివకుమార్ (ఫైల్)

న్యూశాయంపేట : తెలంగాణ బీసీ ప్రజాసంఘం వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రంగశాయిపేటకు చెందిన శివకుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ తెలిపారు. ఈ మేరకు ఓసిటీలో ఆదివారం జరిగిన సమావేశంలో శివకుమార్‌కు నియామక పత్రం అందచేశారు.